జోరుగా ఇసుక జీరో దందా

- పట్టణంలోని ఖాళీ స్థలాల్లో డంపులు
- భూపాలపల్లి నుంచి నర్సంపేటకు..
- కట్టడిలో మైనింగ్, రెవెన్యూ శాఖల వైఫల్యం

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో ఇసుక జీరో దందా జోరుగా కొనసాగుతోంది. కట్టడి చేయడంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు విఫలమవడంతో భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల మండలం కాల్వపల్లి నుంచి నర్సంపేటకు ప్రభుత్వ అనుమతి లేకుండానే లారీల్లో ఇసుక తరలుతోంది. అక్రమార్కులు పట్టణంలో ఖాళీ స్థలాల్లో ఇసుక డంప్ చేసస్తూ ట్రాక్టర్లతో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలన్న ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాలను స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేస్తూ అక్రమార్కుల దందాకు పరోక్షంగా సహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుండడం కనపడుతోంది. ప్రభుత్వ నిబంధనల మేరకు 26 టన్నుల సామర్థ్యం కలిగిన లారీ ఇసుకకు రూ.11 వేల 500 డీడీ తీయ్యాలి. కానీ డీడీలు తీయకుండా, అనుమతి తీసుకోకుండానే ఇసుకను తరలిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల పరోక్ష సహకారంతో ఉందని తెలుస్తోంది. మండలాల వారీగా అధికారులకు మామూళ్లు ముడుతున్నట్లు సమాచారం. నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేయడాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

గోదావరి ఇసుక అని నమ్మిస్తూ..

పట్టణంలోని ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్న ఇసుకను గోదావరి ఇసుకగా నమ్మించి ప్రజలనూ వంచిస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కుల ఆగడాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇసుక అక్రమ డంపులను సీజ్ చేస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాలున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు డంపులను స్వాధీనం చేసుకుని అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లబెల్లి పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

క్లుప్తంగా

జర్నలిస్టులను మోసగించేలా సీఎం వ్యాఖ్యలు



నర్సంపేట : రెండో సారి అధికారంలోకి వచ్చాక ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం జర్నలిస్టులను మోసగించడమేనని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో సీఎంగా కేసీఆర్ కేటాయించిన స్థలాలనే కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. జర్నలిస్టులకు నర్సంపేటలో కేటాయించిన ఇళ్ల స్థలాలను ఇప్పటి వరకు వారికి ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించామని తెలిపారు. నర్సంపేటలోనూ జర్నలిస్టులకు రెండోసారి గెలిచాకే ఇళ్ల స్థలాలు ఇస్తారా అని ప్రశ్నించారు.

ఎస్సారెస్పీ కాల్వ కబ్జాపై అధికారుల విచారణ



పర్వతగిరి : పర్వతగిరి నుంచి కల్లెడ వరకు ఎస్సారెస్పీ కాల్వ కబ్జాపై తహసీల్దార్ వెంకటస్వామి మంగళవారం విచారణ చేపట్టారు. ఎస్సారెస్పీ డీబీఎం 484 ఆర్ ఉపకాల్వను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్టు తెలిపారు. కాల్వ కబ్జాకు గురైనట్టు విచారణలో వెల్లడైందన్నారు. రెండ్రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్రు. విచారణలో ఆర్‌ఐ మాధవి, కస్నానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం



గీసుకొండ : మండల కేంద్రానికి సమీపంలోని నల్లరాతి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన తాటికొండ మల్లేశం మంగళవారం రూ.50 వేల 116 విరాళం అందజేశారు. గుట్టపై షెడ్ల నిర్మాణం కోసం ఖర్చు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, శివాలయ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన ఐదో తరగతి విద్యార్థిని తూల్ల నిధిలా నేహ అండర్-9 విభాగంలో వరల్డ్ కప్ కరాటే చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిందని పట్టణంలోని ఆల్ఫోర్స్ స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు నేహాను ఆ స్కూల్ యాజమాన్యం మంగళవారం అభినందించింది. వరల్డ్ ఫునకోషి షోటోఖాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గోవాలో ఈనెల 7 నుంచి 10 వరకు నిర్వహించిన పోటీలో నేహ గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

ఇసుక లారీ సీజ్

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ వేణు, హోం గార్డు రమేశ్ రుద్రగూడెంలోని జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక లోడ్ రవాణా చేస్తున్న లారీని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రేగొండ నుంచి నర్సంపేటకు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు డ్రైవర్ సందీప్ అంగీకరించడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌తోపాటు లారీ యజమాని రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

పర్వతగిరి : మండల కేంద్రంలోని కుమ్మరిబజార్ బొడ్రాయి ఏరియాలో తాగునీటి పైపులైన్‌కు గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం మరమ్మతు చేశారు. ఆ ఏరియాలోని తాగునీటి సరఫరా చేసే పైపుల్లో చెట్ల వేర్లు పెరిగి కొన్ని రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న క్రమంలో సిబ్బంది స్పందించారు. మరమ్మతు పనులను ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి రఘు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కారోబార్ కరుణాకర్, వెంకన్న, రవి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'వర్గీకరణ అమలయ్యే వరకు నియామకాలు నిలిపేయాలి'

వర్ధన్నపేట : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం (టీఎఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ అమలయ్యే వరకు ఉద్యోగాల నియామకాలు నిలిపేయాలని కర్ణాటక ప్రభుత్వం ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిందని, ఆ తీరుగానే సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో నాయకులు తాటికాయల వివేకానంద, చింత మురళి, మంద అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి



పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు

వర్ధన్నపేట : పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ నాయక్ సూచించారు. మండలంలోని రామవరంలో పశు గణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భ కోశ వ్యాధుల చికిత్స, గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువులకు కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడ దూడలు జన్మిస్తాయని చెప్పారు. ఆడ దూడలకు జన్మనిచ్చేలా ప్రభుత్వం లింగనిర్ధారణ వీర్యం సేకరించిందని తెలిపారు. సదరు వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేస్తే పశువులకు ఖచ్చితంగా ఆడ దూడలు పుట్టి పాడి రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. పాడి రైతులు శిబిరానికి 58 పశువులను తీసుకురాగా ఎదకు రానివి 28 పశువులకు, 4 గేదెలకు కృత్రిమ గర్భధారణ చేశామని వైద్యుడు తెలిపారు. అలాగే 26 దూడలకు నట్టల నివారణ మందు వేశామని, గాలికుంటు నివారణ టీకాలు వేయడంతోపాటు 13 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్స అందించినట్టు వైద్యుడు వివరించారు. కార్యక్రమంలో వీఏ దీకొండ సాయిరాం, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాజేశ్వర్ రావు, గోపాలమిత్రులు మల్లెపాక సంపత్, మైదం రజిత, సుదగాని గోపాల్, గుజ్జరి రాజు, చిలువేరు నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ సంస్థాగత బలోపేతమే ధ్యేయం'

నెక్కొండ : బీజేపీ సంస్థాగత బలోపేతమే ధ్యేయంగా కార్యాచరణ చేపడుతున్నట్టు ఆ పార్టీ నర్సంపేట ఇన్‌చార్జ్ కంభంపాటి పుల్లారావు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలన చూసిన ప్రజలు విసుగుతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. పార్టీ సంస్థాగత బలోపేతంతో రానున్న రోజుల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లపైబడిన వృద్ధులందరి కోసం తలపెట్టిన ఏబీ-పీఎంజేఏవై పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదుతో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని తెలిపారు. సమావేశంలో నాయకులు తాళ్లూరి లక్ష్మయ్య, అంబాల రాంగోపాల్, పింగిళి మోహన్ రెడ్డి, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారావు

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



చెరువులోకి చేప పిల్లలను వదులుతున్న హరీశ్

పర్వతగిరి : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఫిషరీస్ శాఖ ఫీల్డ్ అధికారి హరీశ్ తెలిపారు. మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్‌లో 85 వేల చేప పిల్లలను మంగళవారం ఆయన వదిలి మాట్లాడారు. మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందని తెలిపారు. మత్స్యకారులు చేపపిల్లలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సదానంద, యశ్వంత్, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్దన్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు రాంచందర్, సునీల్‌రావు, గంగాధర్ రావు, కంఠం సుధాకర్, కొండ వెంకటేశ్వర్లు, నీలటి వెంకటేశ్వర్లు, రావుల రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వాన మొగులు.. రైతన్నల్లో గుబులు

సంగెం : పంటలు చేతికొచ్చే సమయంలో మబ్బులు రైతన్నలకు గుబులు పుట్టిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట కోతకు వచ్చింది. కొన్ని గ్రామాల్లో కోతలు మొదలయ్యాయి. పత్తి పగిలి ఏరడానికి సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రెండ్రోజులుగా ఆకాశం మేఘావృతమై ఏ క్షణాన వర్షం కురుస్తుందో తెలయని స్థితి నెలకొనడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే పత్తి నాణ్యత దెబ్బతింటుందని, వరి నేలవాలుతుందని రైతులు బెంబేలెత్తుతున్నారు. వరి కోతలపై వర్షం కురిస్తే చైన్ యంత్రంతో పంట కోయించాలంటే భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. కోతలు చేపట్టిన గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు మొదలు కాకపోవడంతో రైతులు వేదనకు గురౌతున్నారు. ఇకనైనా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



సంగెంలో కోతకు వచ్చిన వరిపంట

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



రాయపర్తి : బెల్ట్, షూ అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



గీసుకొండ : విద్యార్థులతో లయన్స్ క్లబ్ సభ్యులు

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా ఉంటామని ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొండాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన మంగళవారం టై, బెల్ట్, షూ, ఐడీ కార్డులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని చదువులో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు చెవ్వు కాశీనాధం, జాజునాయక్, మాజీ సర్పంచ్ కోదాటి దయాకర్‌రావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, తేరాల యాకయ్య, గజవెల్లి ప్రసాద్, ఎద్దు రమేశ్, చిన్నాల రాజబాబు, సుధాకర్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

గీసుకొండ : మండలంలోని కొమ్మాల జెడ్పీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ప్రతినిధులు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యురాలు డాక్టర్ ఉష, ఎంజేఎఫ్ మూర్తి, సంయుక్త, కరుణావతి, రాణిరుద్రమ, హెచ్ఎం మోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు పక్కనే చెత్త

చెన్నారావుపేట శివారులో రోడ్డు పక్కనే చెత్త, ప్లాస్టిక్ వేస్టేజీ, కోళ్ల కళేబరాలు కంపు కొడుతున్నాయి. నెక్కొండ రోడ్డులోని ప్రధాన రహదారి పక్కనే ఈ దుస్థితి నెలకొనడంతో గ్రామానికి వచ్చే ప్రజలు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు ఇరువైపులా శుభ్రత పరిఢవిల్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- చెన్నారావుపేట**

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రంజిత్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9704343688

సర్వేకు సహకరించాలి

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జిల్లా నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి కోరారు. మండలంలోని తోపనపల్లి, అమీన్‌పేట, అప్పల్‌రావుపేట గ్రామాల్లో సమగ్ర సర్వేను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్యుమరేటర్లకు, సిబ్బందికి సరైన వివరాలు అందించాల్సిన బాధ్యత ప్రజల మీదే ఉందన్నారు. ఎన్యూమరేటర్లు, సిబ్బంది అంకితభావంతో సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ గోవిందరాజన్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, ఏఎస్ఓ హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం..?

వర్ధన్నపేట : ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపగా తాను అప్రమత్తంగా లేకపోతే తమ ప్రాణాలకు ప్రమాదం వాటిల్లేదంటూ ద్విచక్ర వాహనదారు వాగ్వాదానికి దిగిన ఘటన పట్టణంలోని బస్టాండ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఓ ద్విచక్ర వాహనదారు బస్టాండ్‌లో అడ్డుకుని గొడవకు దిగాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడిపాడని, తాను అప్రమత్తంగా లేకపోతే తమ ప్రాణాలు పోయేవంటూ డ్రైవర్ నుంచి తాళాలు స్వాధీనం చేసుకుని వాగ్వాదానికి దిగాడు. సంగెం వు వాగు వద్ద తాను ప్రయాణిస్తున్న బైక్‌ను ఆర్టీసీ డ్రైవర్ అతివేగంతో ఓవర్‌టేక్ చేశాడని తెలిపాడు. ఆర్టీసీ ప్రయాణికులు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఏది ఏమైనా ఆర్టీసీ డ్రైవర్లు బస్సు నడిపే క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ప్రయాణికులు, స్థానికులు కోరారు.

వరి పొలంలో క్షేత్ర సందర్శన

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు వరి పొలంలో మంగళవారం అధ్యయనం చేశారు. విద్యార్థులకు జీవ శాస్త్ర పాఠ్యాంశంలో వరి పంటలో సిలింద్రియాలు, బ్యాక్టీరియా ఉత్పత్తి, తెగులు, తదితర అంశాలపై ఉపాధ్యాయురాలు కేతిడి గౌతమి అవగాహన కల్పించగా హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పొన్నం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన క్రీడాపోటీలు



రాయపర్తి : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పదో జోనల్ స్థాయి క్రీడాపోటీలు మంగళవారం కొనసాగాయి. ఖోఖో, క్యారమ్స్, చెస్, వాలీబాల్, షాట్‌పుట్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ సరిత పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో డీసీఓ అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్సు అప్పగింత

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్ శివారు సీతామన్‌తండాకు చెందిన మాలోతు వనితకు ఆమె పోగొట్టుకున్న పర్సును గ్రామానికి చెందిన వెంకన్న మంగళవారం అప్పగించారు. పర్సు బందెల వెంకన్న కిరాణం షాపు వద్ద దొరికినట్టు వెంకన్న చెప్పారు. కార్యక్రమంలో బందెల వెంకన్న, కత్తుల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

నర్సంపేట రూరల్/పర్వతగిరి/చెన్నారావుపేట : పదో తరగతిలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సృజన్ తేజ కోరారు. నర్సంపేట మండల కేంద్ర శివారులోని గురుకుల పాఠశాలతోపాటు పర్వతగిరి, చెన్నారావుపేట మండల కేంద్రాల్లోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాలను, మోడల్ స్కూళ్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలతోపాటు టీచర్ల డైరీలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ టెస్ట్ నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఎన్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేసి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపే దిశగా చొరవ చూపాలని సూచించారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రోత్సహించాలని చెప్పారు. ఎఫ్ఏ, ఎస్ఏ ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులందరూ మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రణాళికాయుతంగా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.



నర్సంపేట రూరల్ : విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న సృజన్ తేజ



నర్సంపేట : శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం

నర్సంపేట : కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని డఫోడిల్స్ స్కూల్ ఆవరణలో స్థానిక వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గట్టు నారాయణాచార్యులు దేవీ ఉపాసకులతో శ్రీలక్ష్మీనృసింహ సహస్ర నామ పారాయణం చేయించారు. అనంతరం కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి రామాచార్య, అడిగొప్పుల విష్ణు, తూప్రాని ఫణీంద్ర, మరింగంటి నర్సింహాచార్యులు, దాస్యం రంగనాథస్వామి కల్యాణం జరిపించారు. స్కూల్ కరస్పాండెంట్ చింతల నిరంజన్, నరేందర్ స్వామి వారికి పట్టువస్త్రాలు, గజమాల సమకూర్చారు. అర్చకులు భక్తులకు రక్షా కంకణాలు అందజేసి ఆశీర్వదించారు. కైంకర్య భక్తులకు శేష వస్త్రాలు, అర్చన పూజాధికాలు, తలంబ్రాలు అందించారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆ సంఘం ఆధ్వర్యంలో సామూహిక శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. సంఘం మండల అధ్యక్షుడు శింగిరికొండ మాధవ శంకర్ జ్యోతిప్రజ్వలన చేసి వ్రతాలను ప్రారంభించారు. అర్చకుడు సత్యనారాయణస్వామి వ్రతాలు చేయించారు. కార్యక్రమంలో పబ్బా రమేశ్, తోట బాలభాస్కర్ గుప్తా, వంగేటి గోవర్ధన్, వేముల రాజు, బ్రాహ్మణపల్లి సుమన్, అంచూరి కృష్ణమూర్తి, నాగమల్ల కృష్ణమూర్తి, పిన్నా రామనాథం, గర్రెపల్లి శ్రీనివాస్, బాదం విజయ్, శింగిరికొండ రజని, ఇమ్మడి పద్మ, చంద స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : వ్రతం చేస్తున్న భక్తులు

సిద్దేశ్వరాయలంలో భజన

చెన్నారావుపేట : కార్తీక మాసం సందర్భంగా మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయంలో సోమవారం రాత్రి భక్తులు భజన చేశారు. తొలుత అర్చకుడు బీఎం.శాస్త్రీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు భారీ సంఖ్యలో హాజరై భజన చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి రైతులకు మద్దతు ధర లభిస్తుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి తెలిపారు. మండలం కేంద్రంలోని చిన్మయ్ దేవి ట్రేడర్స్ (దుర్గా కాటన్ ఇండస్ట్రీస్)లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీసీఐ అధికారి సుశీల్ కుమార్, ఎస్సై మహేందర్, ఏఓ నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దొడ్డ విజయ్, తాళ్లూరి నర్సింహస్వామి, తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న హరీశ్‌రెడ్డి

పత్తి కొనుగోలులో షరతులు సరికాదు



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న పైడి, నాయకులు

నర్సంపేట : పత్తి కొనుగోలులో షరతులు విధించడం సరికాదని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం ఆర్డీఓ ఉమారాణికి మంగళవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా పైడి మాట్లాడారు. పత్తి రైతులకు చీడపీడల నుంచి పంటను రక్షించుకున్నా ఎకరాకు 4-6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేయడంలో షరతులు విధించడంతో దళారుల పాలు కావాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. పెట్టుబడి పెరిగి ఆదాయం తగ్గి పత్తి రైతులు దివాలా తీస్తున్నారని వివరించారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి షరతులు లేకుండా పత్తిని సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి ఈరెల్లి రాంచందర్, నాయకులు శివరాత్రి కుమారస్వామి, గొర్రె మొగిలి, కడారి సురేశ్, సుక్క వీరన్న, అజ్మీర శ్రీరామ్, వీరన్న, తిరుపతి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో లంచావతరాలు..!

వర్ధన్నపేట : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో లంచావతారులున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. సర్టిఫికెట్ జారీలో జాప్యం చేస్తూ దరఖాస్తుదారు నుంచి లంచం డిమాండ్ చేస్తున్న ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వివరాలిలా.. మండలంలోని ల్యాబర్తికి చెందిన పంజా మల్లేశ్ తండ్రి కనకయ్య మృతి చెందగా భూమార్పిడి కోసం ఫ్యామిలీ సర్టిఫికెట్ అవసరం ఏర్పడింది. మల్లేశ్ సర్టిఫికెట్ కోసం సెప్టెంబర్ 16న దరఖాస్తు చేయగా రెండు నెలలు గడచినా సర్టిఫికెట్ ఇవ్వకపోగా రూ.1500 ఇస్తేనే సర్టిఫికెట్ వస్తుందని, మిగతా అధికారులతో మాట్లాడుకుని డబ్బులు ఇవ్వాలని ఫోన్‌లో చెప్పిన అధికారి మాటలను బాధితుడు రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసినట్టు తెలుస్తోంది.

విద్యార్థిని వైద్య విద్యకు తోడ్పాటు

వర్ధన్నపేట : మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన బలే రమ్య వైద్య విద్య అభ్యసించే దిశగా వర్ధన్నపేటకు చెందిన మహా ఆదిసేవ సమితి ప్రతినిధులు డాక్టర్ సీనపెల్లి విజయకుమార్, విక్రమ్‌కుమార్ మంగళవారం తోడ్పాటు అందించారు. అనంతరం విజయ్‌కుమార్, విక్రమ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. పేద కుటుంబానికి చెందిన రమ్య హైదరాబాద్‌లోని టీఆర్ఆర్ వైద్య కళాశాలలో ప్రవేశం సాధించగా ఆమె మొదటి సంవత్సరం ఫీజు, ఇతర ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేసినట్టు తెలిపారు. రమ్య ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పేదలకు మహా ఆది సేవా సమితి అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జోగుల కుమార్, పసులాది నరేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

చెన్నారావుపేట : ఆటో బోల్తా పడ ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. నంబర్ వన్ కాలనీకి చెందిన జంలిలి సదయ్య తన ప్యాజిండర్ ఆటోతో నర్సంపేట నుంచి కాలనీకి వస్తుండగా బ్యాంకు ఎదుట పోసిన సీసీ రోడ్డుకు ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో ఆటో బోల్తాపడింది. సదయ్యతోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న బోడ స్వరూప గాయాల పాలయ్యారు. క్షతగ్రాతులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.